# 40

# ఇశ్రాయేలుకు విమోచన

## (యెషయా 43)

ఆశ్చర్యమైన ఈ అధ్యాయమును నా రచన నిమిత్తము నేను మొదటి హెబ్రీ భాషలో చదివినప్పుడు, "నీ పాదముల నుండి నీ చెప్పులు విడువుము! నీవు నిలిచియున్న స్థలము పరిశుద్ధ ప్రదేశము!" అని బిగ్గరగా కేకవేయాలనిపించింది. అక్కడ ఇవ్వబడిన దేవుని వర్ణనలు అక్షరాలా అత్యంత అసాధారణమైనవై యున్నవి! సృష్టికర్త ఇశ్రాయేలు పరిశుద్ధుడు, రక్షకుడు, విమోచకుడు, రాజు, దేవుని ప్రవృత్తి, జాలి, కృప, కనికరము, ప్రేమ, మరియు స్వతఃసిద్ధమైన స్వభావము గూర్చిన వీటన్నిటిని మనము వినాలని ఇవన్నీ బిగ్గరగా కేకవేస్తున్నాయి.

### ఇశ్రాయేలు విమోచింపబడినది (43:1-7)

అయితే యాకోబూ, నిన్ను సృజించినవాడగు యెహోవా
ఇశ్రాయేలూ, నిన్ను నిర్మించినవాడు ఈలాగు సెలవిచ్చుచున్నాడు
-నేను నిన్ను విమోచించియున్నాను
భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను నీవు నా సొత్తు.
నీవు జలములలో బడి దాటునప్పుడు నేను నీకు తోడైయుందును
నదులలో బడి వెళ్లునప్పుడు అవి నీమీద పొర్లిపారవు.
నీవు అగ్ని మధ్యను నడచునప్పుడు కాలిపోవు, జ్వాలలు నిన్ను కాల్చవు
యెహోవానగు నేను నీకు దేవుడను, ఇశ్రాయేలు
    పరిశుద్ధదేవుడనైన నేనే నిన్ను రక్షించువాడను
నీ ప్రాణరక్షణ క్రయముగా ఐగుప్తును ఇచ్చియున్నాను
నీకు బదులుగా కూషును సెబాను ఇచ్చియున్నాను.
నీవు నా దృష్టికి ప్రియుడవైనందున ఘనుడవైతివి
నేను నిన్ను ప్రేమించుచున్నాను గనుక నీకు ప్రతిగా
    మనుష్యులను అప్పగించుచున్నాను
నీ ప్రాణమునకు ప్రతిగా జనములను అప్పగించుచున్నాను.
భయపడకుము, నేను నీకు తోడైయున్నాను
తూర్పునుండి నీ సంతానమును తెప్పించెదను
పడమటినుండి నిన్ను సమకూర్చి రప్పించెదను.
అప్పగింపుమని ఉత్తరదిక్కునకు ఆజ్ఞ ఇచ్చెదను
బిగబట్టవద్దని దక్షిణదిక్కునకు ఆజ్ఞ ఇచ్చెదను
దూరమునుండి నా కుమారులను
భూదిగంతమునుండి నా కుమార్తెలను తెప్పించుము.
నా మహిమ నిమిత్తము నేను సృజించినవారిని
నా నామము పెట్టబడిన వారినందరిని తెప్పించుము
నేనే వారిని కలుగజేసితిని వారిని పుట్టించినవాడను నేనే.

"అయితే" అను పదము అంతకు మునుపు చెప్పబడిన దాని గూర్చి తర్కబద్ధమైన దైవీక వ్యాఖ్యానమును పరిచయము చేయుచున్నది. ప్రవక్త "నిన్ను సృజించినవాడు" (*bora'ᵃka*) లేక చేసినవాడు, "నిన్ను నిర్మించినవాడు" (*yotserka*) అనునవి "నీ సృష్టికర్త"కు సమాంతరమైన పదములైయున్నవి. ఈ రెండూ కూడ హెబ్రీ భాషలో, దేవుని కార్యకలాపమును వర్ణించుచూ వర్తమాన అసమాపక క్రియా పదములుగా వాడబడినవి. ఈ పదములు ఆదికాండములోని సృష్టి వివరములకు సంబంధించిన దేవుని విషయములో కూడ చూడనగును (ఆదికాండము 1:27; 2:7). "నిర్మించినవాడు" అనునది దేవుని శ్రద్ధవలె, కుమ్మరివాడు తన మనోసంకల్పము చొప్పున ఒక మంటి పాత్రకు రూపకల్పన చేయునప్పుడు ఎంతో శ్రమతో తీసికొను జాగ్రత్తవలె, ఎక్కువ సన్నిహితమైన పదమని J. Alec Motyer భావించుచున్నాడు.[1]

"భయపడకుము" అను పదము ఈ గ్రంథంలో పునరావృతమగుచుండు ఉద్బోధయైయున్నది.[2] భయపడకుండుటకు గల కారణములివ్వబడినవి: "నేను నిన్ను విమోచించియున్నాను; పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను."[3] విమోచించుట గూర్చిన భావము "నిర్మించుట" కంటే మరింత సన్నిహితముగానున్నది. దేవుడు విమోచన క్రయధనమును చెల్లించి ఇశ్రాయేలు పక్షాన సమీప బంధువువలె ప్రవర్తించాడు. పేరు పెట్టి పిలువడము ఆయన ఒకరితో సూటిగా కలిగియున్న వ్యక్తిగత సంబంధమును సూచించుచున్నది. ఒక వ్యాఖ్యానకర్త దీనిని యేసుకు వర్తించాడు:

> *Gealtika* (నేను నిన్ను విమోచించియున్నాను) అను పదములో అంతర్గముగా దాగియున్న అంతు దొరకని లోతును మనము అవగాహన చేసికొనలేము. ... విమోచన, విమోచన, విమోచన, ఇదే మన విశ్వాస ప్రమాణమై, మన వేదాంతమై, లేక విశిష్టమైన ప్రవృత్తియై, మన దేవుని అనుదిన స్తుతిగానమై, మన రహస్య జ్ఞానమై, మన గొప్ప విలువైన ముత్యమై, మన అమూల్యమైన ఆభరణమై, మన సమస్తమై ... యుండవలెను. మనలను రక్షించిన రక్తము తప్ప, మనము మరిదేనినైనను ఎరుగకుందుముగాక. నేను నీ ప్రేమను, ఆ మాట కొస్తే నిన్నే తప్ప, మరి దేని గూర్చియైనను ఆలోచించక, దేనినైనను చూడక, అనుభూతి చెందక, వినక, ప్రేమించక, గౌరవించక యుందునుగాక.[4]

జీవితములో అత్యంత తీవ్రమైన పోరాటములను ఎదుర్కొనునప్పుడు దేవుని యందు నమ్మకముంచుట వలన ఏర్పడు పరిణామములు దేవుని సన్నిధి ప్రసన్నత మరియు ఆయన సహాయము ద్వారా సూచింపబడును (1 కొరింథీయులకు 10:13 చూడుము). వారు కష్టకాలములో తన సన్నిధితో వారిని కాపాడి సంరక్షించు దేవునియందు ఆత్మస్థైర్యముతో కూడిన నమ్మకమును ఉంచవచ్చునని ఈనాడు భరించరాని దుస్థితులలో ఉన్నవారికి 2వ వచనము అభయమిచ్చుచున్నది. "నీవు జలములలో బడి దాటునప్పుడు నేను నీకు తోడైయుందును; నదులలో బడి వెళ్లునప్పుడు, అవి నీ మీద పొర్లిపారవు. నీవు అగ్ని మధ్యను నడచునప్పుడు కాలిపోవు, జ్వాలలు నిన్ను కాల్చవు" అని దేవుడైన యెహోవా యూదా ప్రజలకు వాగ్దానము చేశాడు. ఆయన వారితో కూడ అక్కడ ఉండుట మాత్రమేగాక, ఆయన వారికి సహాయము చేయుచుండును.

"యెహోవానగు నేను నీకు దేవుడను, ఇశ్రాయేలు పరిశుద్ధదేవుడనైన నేనే నిన్ను రక్షించువాడను" అని ఆయన ప్రకటించాడు (3 వచనం). "యెహోవానగు నేను నీకు దేవుడను" అనునది ఇశ్రాయేలు నిర్గమమునకు సంబంధించిన చర్చనీయాంశమై యున్నది.[5]

దేవుడు ఇశ్రాయేలీయులకు మార్గదర్శకుడై వారిని ఐగుప్తులోనుండి వాగ్దాన దేశమునకు నడిపించుచుండినప్పుడు ఆయన విషయములో ఇటువంటి పదములు వాడబడినవి. నిజముగా, పాత నిబంధన యందంతటి చర్చనీయాంశము ఇదే. ఇంకా, దేవుడు "ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడునై" యున్నాడు. "ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడు" – ఈ నామము యెషయా దేవునికి పెట్టుకొన్న ఒక ప్రత్యేక బిరుదమై యున్నది. "నిన్ను రక్షించువాడు" అను పదము, "ఆపత్కాలములో నిస్సహాయుడై యుండువానిని ఆదుకొనుటకు అందుబాటులో ఉండి సహాయము చేయుటకు వెంటనే ముందడుగు వేయువాడు" అని చిత్రించుచున్నది.[6] ఐగుప్తు కూషు మరియు సెబా "విమోచన క్రయధనముగా" యివ్వబడును. ఐగుప్తుకు దక్షిణమున నైలు నది యొక్క రెండవ మరియు మూడవ జలపాతముల మధ్య నుండిన ప్రాంతమునకు పెట్టబడిన "కూషు" అను పేరు దాని హోదాను తెలియజేయుచుండిన తొలి పేరై యుండినది. అటుతరువాత ఈ ప్రాంతము ఇతియోఫియా అని పిలువబడినది. కూషు నుండి ఎఱ్ఱ సముద్రమునకు అడ్డుగానున్న దక్షిణ అరేబియాలో గల ఎడారి ప్రాంతమే సెబా.

ఆయనకు "ప్రియుడు," ఆయన దృష్టికి "ఘనుడు," మరియు ఆయన "ప్రేమించువాడు" (4 వచనం) – ఇవన్నీ కూడ విధేయులైన తన పిల్లలపట్ల దేవుడు కలిగియున్న వైఖరిని చూపించుచున్నవి. మూల భాషలో అద్యతన (పరిపూర్ణ) భూతకాలములో ఉన్న ఈ మాటలన్నీ, "వర్తమాన కాలములోనికి ఒక ప్రవాహమువలె ప్రవహించుచున్న గతమును ఇక్కడ సూచించుచున్నవి: 'ఆయనందును' ఘనుడవు 'అయితివి.' "[7]

"భయపడకుము, నేను నీకు తోడైయున్నాను" అని దేవుడు తన ప్రజలకు అభయమిచ్చుచున్నాడు (5 వచనం). "భయపడకుము" అని 41:10లో అభయమిచ్చినప్పుడు సహితము దేవుడు ఇదే హేతువును చూపించాడు. ఇంకా, "నేను నిన్ను విమోచించియున్నాను" అనియు (43:1), "నేను నీకు సహాయము చేసెదను" అనియు (41:13, 14) ఆయన సెలవిచ్చాడు. భూదిగంతముల నలుమూలల నుండి విశ్వాసపాత్రమైన శేషమును తీసుకురావాలని దేవుడు ఉద్దేశించాడు[8]: "అప్పగింపుమని" ఉత్తరదిక్కునకు ఆజ్ఞ ఇచ్చెదను, "బిగబట్టవద్దని" దక్షిణ దిక్కునకు ఆజ్ఞ ఇచ్చెదను (6 వచనం). దేవుడు, తన మహా కృపనుబట్టి, శేషము దాని స్వదేశమునకు తిరిగి రావలెనని పిలుపునిచ్చుచున్నాడు.

మరలా 7వ వచనంలో, మనము సృష్టి సమయంలో దేవుడు ఉపయోగించిన భాషను/మాటలను చూచుచున్నాము: "సృజించిన," "కలుగజేసిన" మరియు "పుట్టించిన." మనము దేవుని "మహిమ" నిమిత్తము సృజింపబడియున్నామని మనము ఎల్లప్పుడు జ్ఞాపకముంచుకొనవలెను.

### దేవుని సాక్షియైన ఇశ్రాయేలు (43:8-13)

కన్నులుండి అంధులైనవారిని చెవులుండి బధిరులైన
    వారిని తీసికొని రండి
సర్వజనులారా, గుంపుకూడి రండి
జనములు కూర్చబడవలెను
వారిలో ఎవరు ఇట్టి సంగతులు తెలియజేయుదురు?
పూర్వకాలమున జరిగినవాటిని ఎవరు మాకు వినిపించుదురు?

తాము నిర్దోషులమని తీర్పుపొందునట్లు తమ సాక్షులను తేవలెను
లేదా, విని సత్యమే యని యొప్పుకొనవలెను.
మీరు తెలిసికొని నన్ను నమ్మి నేనే ఆయననని
 గ్రహించునట్లు మీరును నేను ఏర్పరచుకొనిన
 నా సేవకుడును నాకు సాక్షులు.
నాకు ముందుగా ఏ దేవుడును నిర్మింపబడలేదు నా
 తరువాత ఏ దేవుడు నుండడు.
నేను నేనే యెహోవాను, నేను తప్ప వేరొక రక్షకుడు లేడు.
ప్రకటించినవాడను నేనే రక్షించినవాడను నేనే
దాని గ్రహింపజేసినవాడను నేనే; యే అన్యదేవతయు
 మీలో నుండియుండలేదు
నేనే దేవుడను మీరే నాకు సాక్షులు;
 ఇదే యెహోవా వాక్కు.
ఈ దినము మొదలుకొని నేనే ఆయనను
నా చేతిలోనుండి విడిపించగలవాడెవడును లేడు
నేను కార్యము చేయగా త్రిప్పివేయువాడెవడు?

న్యాయస్థాన తీర్పు భాషను యెషయా మరొకసారి ఉపయోగించుచున్నాడు (8, 9 వచనాలు; 41:21–24 చూడుము). "అంధులైనవారు," "బధిరులైనవారు," మరియు "సర్వజనులు" కూడుకొనవలెనని పిలువబడిన తరువాత, వారికి ఒక ప్రశ్న వేయబడినది: "వారిలో ఎవరు ఇట్టి సంగతులు తెలియజేయుదురు? పూర్వకాలమున జరిగినవాటిని ఎవరు మాకు వినిపించుదురు? "పూర్వకాలమున జరిగినవి" అనగా జరుగబోవువాటిని దేవుడు ముందుగానే తెలియజేసిన విషయములు.[9] ఈ సంఘటనల గూర్చి ముందుగానే సరిగ్గా తెలియజెప్పగల సామర్థ్యము దేవునికి తప్ప మరెవరికినీ లేదు.

"సాక్షులు" ముందుకు రావలసినదిగా దేవుడు కోరుచున్నాడు (10 వచనం). జనాంగములు "తెలిసికొని," "విశ్వాసముంచి," మరియు "నేనే ఆయనననని గ్రహించవలసియున్నది." మూడు క్రియలు "తెలిసికొని," "నమ్మి," మరియు "గ్రహించునట్లు" అనునవి "దేవుని గూర్చిన తొలి అనుభవము మొదలుకొని ఆయన స్వభావమును మరియు విధానములను గ్రహించు నిమిత్తము ఆయనపై ఆధారపడుట వరకు పొడిగించుచు, విశ్వాసముయొక్క ప్రగతిని వివరించుచున్నవి."[10]

"నాకు ముందుగా ఏ దేవుడును నిర్మింపబడలేదు, నా తరువాత ఏ దేవుడు నుండడు" అని ప్రవక్త ద్వారా దేవుడు సెలవిచ్చుచున్నాడు. మానవ హస్తములతో చేయబడిన విగ్రహములకు తారతమ్యముగా, దేవునికి ఆది గాని అంతము గాని లేదు. ఆదియును అంతమును ఆయనే. భూమి సృజింపబడక మునుపే, నిత్యుడగు దేవుడు ఉన్నాడు (ఆదికాండము 1:1).

దేవుని విశిష్ఠత 11–13 వచనములలో తెలియజెప్పబడియున్నది. ఈ మూడు వచనములలో గల 29 హెబ్రీ పదములలో 12 పదములు ప్రథమ పురుష ఏక వచనములో నున్నవి. దేవుడు నిరపేక్షముగా ప్రభువును, రక్షకుడునైయున్నాడు (11 వచనం), ఆయన చేయు ప్రకటనలన్నిటిలోను ఆయన నిరపేక్షమైనవాడై యున్నాడు (12 వచనం), కార్యము చేయు విషయములో కూడ ఆయన నిరపేక్షమైనవాడై యున్నాడు (13 వచనం).

"మీరు నాకు సాక్షులు" అని దేవుడు ఇశ్రాయేలీయుల గూర్చి చెప్పినట్లే, యేసు తన శిష్యుల గూర్చి ప్రస్తావించాడు (10 వచనం; అపొస్తలుల కార్యములు 1:8). ఈ రెండూ కూడ "తాజా అనుభవమును తెలియజేయు నిరాపేక్షణీయమైన భాషను" సూచించుచున్నవి.[11]

## బబులోనుకు సంభవింపనైయున్న సర్వనాశనము (43:14–21)

ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడును మీ విమోచకుడునైన
    యెహోవా ఈలాగు సెలవిచ్చుచున్నాడు –
మీ నిమిత్తము నేను బబులోను పంపితిని
నేను వారినందరిని పారిపోవునట్లు చేసెదను
వారికి అతిశయాస్పదములగు ఓడలతో కల్దీయులను పడవేసెదను.
యెహోవానగు నేనే మీకు పరిశుద్ధ దేవుడను
ఇశ్రాయేలు సృష్టికర్తనగు నేనే మీకు రాజును.
సముద్రములో త్రోవ కలుగజేయువాడును
వడిగల జలములలో మార్గము కలుగజేయువాడను
రథమును గుఱ్ఱమును సేనను శూరులను నడిపించువాడునగు యెహోవా
ఈలాగు సెలవిచ్చుచున్నాడు.
వారందరు ఏకముగా పండుకొని లేవకయుందురు
వారు లయమై జనుపనారవలె ఆరిపోయిరి.
మునుపటివాటిని జ్ఞాపకము చేసికొనకుడి
పూర్వకాలపు సంగతులను తలంచుకొనకుడి.
ఇదిగో నేనొక నూతనక్రియ చేయుచున్నాను
ఇప్పుడే అది మొలుచును మీరు దాని నాలోచింపరా?
నేను అరణ్యములో త్రోవ కలుగజేయుచున్నాను
ఎడారిలో నదులు పారజేయుచున్నాను.
నేను ఏర్పరచుకొనిన ప్రజలు త్రాగుటకు అరణ్యములో
    నీళ్లు పుట్టించుచున్నాను
ఎడారిలో నదులు కలుగజేయుచున్నాను
అడవి జంతువులును అడవి కుక్కలును నిప్పుకోళ్లును నన్ను ఘనపరచును
నా నిమిత్తము నేను నిర్మించిన జనుల నా స్తోత్రమును ప్రచురము చేయుదురు.

దేశబహిష్కృతమై చెరగానుండు యూదాకు దేశమైయుండు స్థలము, బబులోనే, నాశనమగునని దేవుడు ప్రకటించాడు (14 వచనం). "వారు ఆనందించు ఓడలు" వారి అవమానకరమైన తిరోగమనమునకు ఉపయోగింపబడును. దేవుని ప్రకటన ఖచ్చితమైనది, ఏలయనగా ఆయన "యెహోవా," "పరిశుద్ధుడు," "ఇశ్రాయేలు సృష్టికర్త" మరియు "రాజునైయున్నాడు" (15 వచనం). "ప్రబలముగా గణనీయమైనవైయున్న ఇటువంటి అధికార పేర్లను పునరుక్తి గావించుట దేవుని పోల్చరాని శక్తిని మరియు ఇశ్రాయేలు ఆయన ఎన్నుకొనిన జనాంగమని వారికి అనుగ్రహముగా ఇవ్వబడిన స్థానమును ఉద్ఘాటించుచున్నదని Clyde M. Woods చెప్పాడు."[12]

ఇశ్రాయేలీయులు తన శక్తివంతమైన హస్తము చేత ఐగుప్తు బానిసత్వములోనుండి విడుదల చేయబడిన విధానాన్ని దేవుడు వారికి గుర్తుచేశాడు (16, 17 వచనాలు;

నిర్గమకాండము 14 చూడుము). "మునుపటి విషయాలు" (18 వచనం) సంభవించునని దేవుడు ముందుగానే సెలవిచ్చినవి మరియు వారి నిర్గమములో నెరవేరిన సంఘటనలై యుండినవి.

దేవుడు "ఏదో ఒక నూతన క్రియను" చేయనై యుండెను (19, 20 వచనాలు). అది జాతీయ పొలిమేరలు లేని ఒక నూతన నిర్గమమైయుండినది. ప్రజలకు "దేవుని యొక్కయు గొఱ్ఱెపిల్ల యొక్కయు సింహాసనమునొద్దనుండి ప్రవహించుచు, స్ఫటికము వలె మెరయుచుండు జీవజలములు" ఇవ్వబడును (ప్రకటన 22:1).[13]

గనుక "నా (దేవుని) సోత్రమును ప్రచురము చేయుట" ప్రజల ప్రతిస్పందనయై యుండునని దేవుడు సెలవిచ్చాడు (21 వచనం). గొఱ్ఱెపిల్ల రక్తము చేత రక్షింపబడినవారు నిరంతరాయంగా పరలోక తండ్రిని స్తుతించుచుందురు. మన ఆరాధన సారాంశము ఇదే. "ఆరాధన వలన నాకేమి ప్రయోజనము?" అనునది ప్రశ్న కాదు కానీ "ఆరాధనలో నేనేమి అర్పించుకొనుచున్నాను?" అనునది అసలు ప్రశ్న. ఆయన కృపనుబట్టి మనము దేవుని నిరంతరాయముగా స్తుతించుచుండుట ఆరాధనకు ఆలంబనమునిచ్చు ప్రోత్సాహకమౌతుంది.

### ఇశ్రాయేలు/యాకోబు పాపము మరియు దాని పరిణామములు (43:22-28)

యాకోబూ, నీవు నాకు మొఱ్ఱపెట్టుటలేదు
ఇశ్రాయేలూ, నన్ను గూర్చి నీవు విసికితివి గదా
దహనబలులుగా గొఱ్ఱెమేకల పిల్లలను నాయొద్దకు తేలేదు
నీ బలులచేత నన్ను ఘనపరచలేదు
నైవేద్యములు చేయవలెనని నేను నిన్ను బలవంత పెట్టలేదు
ధూపము వేయవలెనని నేను నిన్ను విసికింపలేదు.
నా నిమిత్తము సువాసనగల లవంగపు చెక్కను
    నీవు రూకలిచ్చి కొనలేదు
నీ బలి పశువుల క్రొవ్వుచేత నన్ను తృప్తిపరచలేదు సరే గదా.
నీ పాపములచేత నీవు నన్ను విసికించితివి
నీ దోషములచేత నన్ను ఆయాసపెట్టితివి.

22వ వచనములోని "నాకు"/"నన్ను" అను సర్వనామము వక్కాణింపు నిమిత్తము మూలభాషలో మొదట వ్రాయబడియున్నది. యూదా ప్రజల ఆరాధనలో నొక్కి వక్కాణింపబడిన విషయము ఏదైనను, అది దేవునితో తగినవిధంగా చెందునట్లు చేయబడలేదు. ప్రజలు సరైన బల్యర్పణలు సరైన హృదయ వైఖరితో తీసుకురాలేదు (23, 24 వచనాలు). అణకువగల హృదయములేని ఆరాధన దేవున్ని అగౌరవపర్చును.[14]

నేను నేనే నా చిత్తానుసారముగా నీ యతిక్రమములను
    తుడిచివేయుచున్నాను
నేను నీ పాపములను జ్ఞాపకము చేసికొనను.
నాకు జ్ఞాపకము చేయుము మనము కూడి వాదింతము
నీవు నీతిమంతుడవుగా తీర్చబడునట్లు నీ వ్యాజ్యెమును వివరించుము

నీ మూలపితరుడు పాపముచేసినవాడే, నీ మధ్యవర్తులు
    నామీద తిరుగుబాటు చేసినవారే.
కావున నేను ప్రతిష్ఠితులకు నీ ప్రధానులను అపవిత్రపరచితిని
యాకోబును శపించితిని ఇశ్రాయేలును దూషణ పాలు చేసితిని.

దేవుని కృపకు యోగ్యమగునట్లు ఇశ్రాయేలు ఏమీ చేయలేదు (25, 26 వచనాలు). దేవుడు తన కృపను "ఆయన నిమిత్తమే" క్రుమ్మరించాడు. పౌలు యిలా ప్రకటించాడు,

> ఏ భేదమును లేదు; అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు. కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు. పూర్వము చేయబడిన పాపములను దేవుడు తన ఓరిమివలన ఉపేక్షించినందున, ఆయన తన నీతిని కనుపరచవలెనని, క్రీస్తుయేసు రక్తమునందలి విశ్వాసము ద్వారా ఆయనను కరుణాధారముగా బయలుపరచెను. దేవుడిప్పటికాలమందు తన నీతిని కనబరచునిమిత్తము, తాను నీతిమంతుడును యేసునందు విశ్వాసముగలవానిని నీతిమంతునిగా తీర్చువాడునై యుండుటకు ఆయన అలాగు చేసెను (రోమీయులకు 3:23-26).

ఇదే సందేశమును యెషయా యిలా నివేదించుచున్నాడు: "నీ మూలపితరుడు పాపముచేసినవాడే" (27 వచనం). ఈ రిఫరెన్సు ఆదామును, అబ్రాహామును, లేదా యాకోబును సూచించుచుండవచ్చును. ఎవరిని సూచించినా, అర్థమొక్కటే: "ఎంతటి పేరుప్రతిష్ఠలున్న వ్యక్తియైనా లేక ఎంతటి ధర్మపరాయణుడైనా దానితో నిమిత్తము లేకుండా ... పరిశుద్ధ సత్యవేదము వారి పాపములను ఎటువంటి సంకోచముగాని భేదముగాని లేకుండా చాటిచెప్పెను."[15]

"ప్రతిష్ఠితులగు ప్రధానులు" (28 వచనం) దేవునికి బల్యర్పణలు గావించుటకు ఏర్పాటుచేయబడిన యాజకులై యుండిరి (1 దినవృత్తాంతములు 24:5). ఇశ్రాయేలు త్రాగుబోతులని యెషయా ఇదివరకే వారిపై ఆరోపించాడు (28:7).

"యాకోబును శపించితిని ఇశ్రాయేలును దూషణపాలు చేసితిని" అను మాటలతో ఈ విభాగము ముగియుచున్నది. "శపించితిని" (*cherem*) అను పదము పాత నిబంధనలో రెండు ప్రత్యేకమైన పనులు కలిగియున్నది: వస్తువులను దేవుని సేవకు అంకితము చేయును (లేవీయకాండము 27:28) మరియు, ఇక్కడ తెలియజెప్పబడుచున్నట్లుగా, వస్తువులను లేక వ్యక్తులను నాశనమునకు అప్పగించును (యెహోషువ 6:17). దేవుడు తన ప్రజలను నాశనమునకు అప్పగించుచుండెను.

---

సూచనలు

[1]J. Alec Motyer, *The Prophecy of Isaiah: An Introduction & Commentary* (Downers Grove, Ill.: InterVarsity Press, 1993), 330. [2]ఇదే అభిప్రాయము యెషయా 41:10లోను 7:4; 10:24; 40:9; 41:13, 14; 43:5; 44:2; 51:7; 54:4; 54:11-14లోను అభివ్యక్తము చేయబడియున్నది. [3]దేవుని ప్రజలు "విమోచింపబడుదురు" అను అభిప్రాయము అంతకు మునుపు 1:27; 35:9లో నివేదింపబడినది. [4]Edward J. Young, *The Book of Isaiah,* vol. 3, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1972), 140. [5]నిర్గమకాండము 6:7; 16:12; 20:2, 5; లేవీయకాండము 11:45; 19:34; సంఖ్యాకాండము 15:41; ద్వితీయోపదేశకాండను 5:6; 24:18 చూడుము. [6]John N. Oswalt, *The Book of*

*Isaiah, Chapters 40-66,* The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1998), 140. [7]Motyer, 332. [8]"నలు మూలలు" – భూదిగంతముల భాగములన్నిటిని సూచించుచున్నది: తూర్పు, పడమర, ఉత్తరము మరియు దక్షిణము (ప్రకటన 7:1; 20:8; యెహెజ్కేలు 7:2 చూడుము). [9]Clyde M. Woods, *People's Old Testament Notes: Isaiah* (Henderson, Tenn.: Woods Publications, 2002), 189. [10]Oswalt, 147.

[11]Ibid., 149. [12]Woods, 191. [13]యోహాను 4:10–14లో వ్రాయబడియున్నట్లు యేసు సమరయ స్త్రీతో చేసిన సంభాషణను కూడ చదువుము. [14]యిర్మీయా 7:5–10; ఆమోసు 4:4, 5; మీకా 6:3–8 చూడుము. [15]Oswalt, 161.

---

# వాక్యభాగాన్ని బోధించుట

**ఎడ్డీ క్లోయర్**

---

## ❖❖❖ మన దుఃఖ సమయమునకు సంబంధించిన మూడు పదములు: ❖❖❖ యెషయా 43వ అధ్యాయంలోని అంత్యక్రియల సందేశము[1]

> "ఆయన అలాగు చెప్పి, 'లాజరూ, బయటికి రమ్మని' బిగ్గరగా చెప్పెను" (యోహాను 11:43).

లాజరు సమాధి యొద్ద నిలుచుండిన యేసు యిలా పలికాడు: "లాజరూ, బయటికి రమ్ము" ఈ మూడు మాటలు సమాధి లోపలి సరిహద్దుల్లోనికి వెళ్లి, మరణము యొక్క శక్తిని శాసించి, పునరుత్థానమును జీవమును వెలుపలికి తెచ్చాయి. అదేవిధంగా, మన ఆలోచనలు మూడు మాటల – మన దుఃఖ సమయములో శక్తిగలవియు అర్థసహితమునైన మాటలు – చుట్టూర తిరుగుచుండవలెనని నేను ఆశిస్తున్నాను. ఈ మాటలు సంఖ్యలో కొద్దిగా ఉన్నవి; కానీ, వాటికున్న శక్తివంతమైన స్వభావమునుబట్టి, జీవితము భరింపరానిదైనప్పుడు అవి పుష్టిని మరియు నిరీక్షణను పుట్టించును.

### మొదటి మాట: "దేవుడు"

మొదటి మాట "దేవుడు." దేవుడెవరు? ఆయన తన ప్రజలకు ఏమని వాగ్దానం చేసాడు?

బైబిల్లోగల ఓదార్పుకు సంబంధించిన అతి గొప్ప వాక్యభాగములలో ఒకటి యెషయా 43లో కలదు. దేవుడు ఇశ్రాయేలుతో యిలా చెప్పుచున్నాడు,

> భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను
>     నీవు నా సొత్తు.
> నీవు జలములలో బడి దాటునప్పుడు నేను నీకు తోడై
>     యుందును
> నదులలో బడి వెళ్లునప్పుడు అవి నీమీద పొర్లిపారవు.
> నీవు అగ్ని మధ్యను నడుచునప్పుడు కాలిపోవు,
>     జ్వాలలు నిన్ను కాల్చవు (1బి, 2 వచనాలు).

దేవుని ప్రజలందరి విషయములోను వాస్తవమైనదైయున్నట్లుగా, మనిషిని

ఉక్కిరిబిక్కిరిచేయు జలప్రళయములో దేవుని బలమైన హస్తముండిన విధానాన్ని ఇశ్రాయేలు కళ్లార చూసినది. నిర్గమకాండము 14వ అధ్యాయంలో వారు లోతైనదియు, పైకి క్రిందకూ ఎగవేయుచుండిన కెరటాలమయమై యుండిన ఎర్ర సముద్రము ఎదుటికి వారు వచ్చారు. ఐగుప్తు సేనలు వారి వెనుక ఉండినవి, దొర్లుచు పొంగిపొర్లుచు కదలాడుచండిన సముద్రము నీళ్లు వారి ముందుండినవి. ఈ పరిస్థితిలో వారిని కాపాడేవారు దేవుడు తప్ప మరెవరునూ కానరారైరి! వాక్యభాగము యిలా చెప్పుచున్నది,

> ... యెహోవా ఆ రాత్రి అంతయు బలమైన తూర్పు గాలిచేత సముద్రమును తొలగించి దానిని ఆరిన నేలగా చేసెను, నీళ్లు విభజింపబడగా, ఇశ్రాయేలీయులు సముద్రము మధ్యను ఆరిన నేల మీద నడిచిపోయిరి, ఆ నీళ్లు వారి కుడి యెడమ ప్రక్కలను వారికి గోడవలె నుండెను (నిర్గమకాండము 14:21, 22).

అటుతరువాత, వాగ్దాన దేశములోనికి ప్రవేశించుటకు వారు ప్రయత్నించుచుండగా, వరద వలె ఉప్పొంగి పారుచు వాటి ఆగ్రహావేశ కోరలను వెలుపలికి చూపించుచు ఎగజిమ్ముచుండిన యోర్దానునది నీళ్లను వారు ఎదుర్కొన్నారు. ఏదిఏమైనా, మనము ఈ క్రింది విధంగా వ్రాయబడియున్నట్లు చదువుదుము,

> అప్పుడు ఆ మందసమును మోయువారు యోర్దానులో దిగినతరవాత మందసమును మోయు యాజకుల కాళ్లు నీటి అంచున మునగగానే (యోర్దాను నది దాని తీరములన్నిటి వెంబడి కోత కాలమున్నన్ని రోజులూ పొంగి పారుచుండును), పైనుండి పారు నీళ్ళు బహు దూరమున సారెతానునొద్దనున్న ఆదామను పురమునకు దగ్గర ఏకరాశిగా నిలిచెను. లవణ సముద్రమును, అరాబా సముద్రమునకు పారునవి బొత్తిగా ఆపబడెను. జనులు యెరికో యెదుటను దాటగా యెహోవా నిబంధన మందసమును మోయు యాజకులు యోర్దాను మధ్య ఆరిన నేలను స్థిరముగా నిలిచిరి. జనులందరు యోర్దానును దాటుట తుదముట్టువరకు ఇశ్రాయేలీయులందరు ఆరిన నేలమీద దాటుచు వచ్చిరి (యెహోషువ 3:15-17).

దేవుని విశ్వసనీయతను బొబ్బరించుచుండిన అగ్నిజ్వాలల మధ్య కూడ ఇశ్రాయేలు గమనించినది. ఈ పరీక్షకు సంబంధించిన ఒక సుస్పష్టమైన ఉదాహరణము దానియేలు 3వ అధ్యాయంలో చూడనగును. రాజగు నెబుకద్నెజరు యొక్క బంగారు ప్రతిమ యెదుట సాగిలపడి నమస్కరించుటకు షద్రకు, మేషాకు మరియు అబేద్నెగో యను వారు నిరాకరించారు. వారు తమ మనస్సులను మార్చుకొనవలెనని విన్నవించుకోబడిరి, కానీ వారు వినరైరి. నెబుకద్నెజరు, అత్యాగ్రహమును రౌద్రమునుగలవాడై, అగ్నిగుండము ఎప్పటికన్న ఏడంతలు వేడిమిగా చేయబడవలెనని ఆజ్ఞాపించాడు. ఈ ముగ్గురునూ అగ్నిగుండములో వేయబడినప్పుడు, వారు ఒంటరిగా లేకుండిరని తెలుసుకొన్నారు. అగ్నిగుండములో నాలుగవ వ్యక్తి కనబడుచుండెను. గనుక నెబుకద్నెజరు అగ్నిగుండము వైపు మరొకసారి చూసాడు. “మేము ముగ్గురు మనుష్యులను బంధించి యీ అగ్నిలో వేసితిమికదా?” అని తన మంత్రుల నడిగెను. వారు “రాజా, సత్యమే” అని సమాధానమిచ్చారు. అందుకు రాజు, “అటు చూడండి! నేను నలుగురు మనుష్యులు బంధకములులేక అగ్నిలో సంచరించుట చూచుచున్నాను, వారికి హాని యేమియు కలుగలేదు, నాల్గవవాని రూపము దేవతల కుమారుని రూపమును బోలినది!” అని వారికి ప్రత్యుత్తరమిచ్చాడు (దానియేలు 3:25). షద్రకు, మేషాకు, మరియు అబెద్నెగో

అగ్నిగుండములో నుండి వెలుపలకి వచ్చినప్పుడు, వారి శరీరముకు అగ్ని యే హానియు చేయలేదని చూసారు. సరికదా, వారి వస్త్రములలో పొగ వాసనయైనను లేకుండినది.

ఔను, దేవుడు ఇశ్రాయేలు యెడల అద్భుతకరమైన తన వాగ్దానములను నిలబెట్టుకొన్నాడు: వారు జలములలో బడి దాటుచుండినప్పుడు, ఆయన వారితోకూడ ఉండెను; వారు నదులలోబడి వెళ్లుచుండినప్పుడు, నీళ్లు వారిని ముంచెత్తలేదు; వారి అగ్ని జ్వాలల మధ్యన నడచినప్పుడు, వారు కాల్చబడలేదు. వరద వలెపొంగి పొర్లి పారుచుండిన వరదల్లోను బొబ్బరింతలు పెట్టుచుండిన అగ్ని జ్వాలలవంటి కష్టకాలంలోను దేవుడు వారికి సహాయం చేశాడు.

ఆయన మనకు కూడా అలాగే సాయంచేస్తాడు. మన కొరకు ఎర్ర సముద్రాన్ని పాయలుగా చేస్తాననిగాని, పోగొట్టుకొనబడన గొడ్డలి తేలునట్లుగాని, లేక మృతులైన మన ప్రియులను లేపుననిగాని ఆయన వాగ్దానంచేయలేదు; కానీ అంతకు మించి గొప్పదైన వాగ్దానమొకటి ఆయన మనకనుగ్రహించాడు. ఆయన మనతో కూడ ఉంటానని సెలవిచ్చాడు. సముద్ర తరంగముల వలె పైపైకి పొర్లి వచ్చు నీళ్లనుగాని లేక మనమార్గములలో ఎదురయ్యే మండుచుండు అగ్ని గుండములనుగాని తొలగిస్తానని ఆయన మనకు వాగ్దానముచేయలేదు, కానీ మనము ఆయనయందు నమ్మకముంచినట్లయితే ఆయన ఈ విషమ పరిస్థితులన్నిటిలోను మనతో కూడ నడుచునని వాగ్దానం చేశాడు.

## రెండవ మాట: "బాబ్"

సహజంగానే, రెండవ మాట "బాబ్." ఆయన జీవించు జీవితమును అభినందిస్తూ మేము గౌరవము మరియు ప్రశంసనుబట్టి కలిసిమెలసి జీవించాము. ఆయనొక మంచివాడును అద్భుతకరమైన వ్యక్తియై యుండెను. ఆయనలో మనము గుర్తించుకొనవలసినవి, హృదయానికి హత్తుకొనవలసినవి, మరియు అనుకరించవలసినవి సలక్షణమైన కొన్ని గుణ లక్షణాలుండినవి.

*ఆయన దేవుని సృష్టిని ఎంతో ప్రేమించాడు.* ఇంటికి వెలుపట నుండు గొప్ప బయటి ప్రపంచాన్ని మెచ్చుకొంటూ మురిసిపోయిన బాబ్ వంటి వ్యక్తిని నేనింతవరకు ఎప్పుడైనను కలిసికొనలేదు. ఆయన తన స్వంత ఇంటిలో కంటే బయటి ప్రపంచంలో గల సృష్టి అందాన్ని దాని వాతావరణాన్ని ఆనందంగా అనుభూతి చెందుచుండును. ఆయన తన బాల్యమునుండి జీవితంలోని చివరి రోజు వరకు కూడ, వేటాడుట, చేపలు పట్టుట, వలలో/బునులో చిన్న చిన్న జంతువులు పక్షులను పట్టుకొనుట, వన్య మృగములను మరియు సృష్టిలోని అద్భుతములకు సంబంధించిన దేనినైనను ఎక్కువగా ప్రేమించాడు.

*తనకు కలిగిన వాటిని ఇతరులతో పంచుకొనుటలోను ఇతరుల గూర్చి తగు శ్రద్ధ వహించుటలోను ఆయన హృదయం చాలా విశాలమైనది.* ఆయనొక వక్త కాదు. అలా ఒక వక్త కావాలని కూడ ఆయన ఎన్నడూ ఆశించలేదు; కానీ, నిశ్శబ్దంగా, తెరవెనుక, ప్రయోజనకరమైన పనులు చేయుటలోను ఇతరుల సమస్యల గూర్చియు దయగల, సున్నితమైన ఆసక్తి కలిగియుండెను. ఇతరులకు ఇవ్వడం, వారిని పైకెత్తడం, వారిని జ్ఞాపకముంచుకొనడమంటే అతనికెంతో ఇష్టం.

*వారున్నపాటుననే ఆయన ఇతరులను అంగీకరించేవాడు.* మేమందరము చక్కగా

ఉండాలనీ, ఎదుగాలనీ, సరైన పనులనే చేయుటకు తీర్మానించుకొనగలగాలనీ ఆయన ఆశించేవాడు; కానీ ఆయా నిర్ణయాలను మా స్వంత సమయంలోను స్వయంగాను చేసికొనుటకు అవకాశమిచ్చేవాడు. ఏదిఏమైనా, మేము మేలైన విషయాలను, సద్గుణములను మరియు సత్యమును ఎన్నుకొన్నప్పుడు ఆయన మమ్ములను ఎంతో ప్రోత్సాహించేవాడు.

*ఆయన ప్రశాంతమైన విశ్వాసము కలిగియుండెను.* ఆయన తన విశ్వాసము గూర్చి యింకా ఎక్కువ బాహాటమైనవాడై యుండి ఉంటే బాగుండేదని నేనెంతో ఆశించాను, కానీ బాబ్ విధానం అలాంటిది కాదు. తన ఆత్మ/రక్షణ గూర్చి నేను ఆయనతో1966లో మాట్లాడాను. బాప్తిస్మము తీసికొనుటకు, అది కూడ ఆయన పెరిగిపెద్దవాడైన వారి ఇంటికి ఒకటిన్నర మైలు దూరంలో ఉండిన వైట్ రివర్‌లో తీసికోవాలని తీర్మానించుకొన్నాడు. ఎక్కువ ఆర్భాటంలేకుండా, మేమిద్దరము కలిసి నది యొద్దకు వెళ్లిన తరువాత, నేను బాప్తిస్మమిచ్చాను. ఆయన తన బైబిలను ప్రతి రోజు చదివేవాడని నాకు అంటోనియా చెప్పాడు. ఆయన వైద్యశాలలో ఉన్నప్పుడు, ఆయన ప్రార్థించుచుండెనో లేదో అని అడిగినప్పుడు, "చేస్తున్నాను!" అని చెప్పినట్లు టోన్య చెప్పింది. ఆయన దేవునితో అన్ని విషయాలను సరిచేసికొని ఆయనతో సమాధానపడినాడో లేదో అని అడిగినప్పుడు ఆయన, "సరిచేసికొన్నాను, సమాధానపడినాను" అని బదులు చెప్పాడు. జెని నేను కలిసి ఆయనకు సువార్తనందించినందకు ఆయనకు ఎంతో ఆనందంగా ఉందని బాబ్ చెప్పాడు. మేము చెప్పుచుండిన విషయాలను వినడానికి ఆయన మా యొద్దకు వచ్చాడు. విన్నాడు, ఆయన రక్షణ గూర్చి మేము చేయుచుండిన ప్రయత్నాన్ని మెచ్చుకొన్నాడు.

## మూడవ మాట: "మనము"

చివరిగా, మూడవ మాట: "మనము." మనము ధ్యానించుచున్న మూడు మాటలు: "దేవుడు," "బాబ్," మరియు "మనము." ఇక్కడ నుండి మనమెక్కడికి వెళ్ళదాము? మనస్సును కలత చెందించి లోటు ఏర్పడింది. మా హృదయాలు బ్రద్దలయ్యాయి. ఇప్పటి నుండి మేము పరలోక తండ్రి ఇంటికి పిలువబడేంత వరకు లేదా మనలను కొనిపోవుటకు క్రీస్తు వచ్చు పర్యంతము మా ఆత్మలలో ఒక శూన్యాన్ని మోసికెళ్ళుచుందుము. ఏదిఏమైనా, అద్భుతకరమైన ఆయన గుణలక్షణాలను మనము మర్చిపోకుండవలెనను దృఢనిశ్చయము మనకుండవలెను. దేవుడు మనకిచ్చిన ఆశ్చర్యకరమైన సృష్టిజాలమంతటినిబట్టి మనము హర్షించుదాము. ఇతరుల గూర్చి తగు శ్రద్ధ వహించుటకును వారితో పంచుకొనుటకును మనము గుర్తుంచుకొందాము. అంగీకరించునదియు ఎటువంటి షరతులు లేనిదైన ప్రేమతో మనము ఒకరినొకరము ప్రేమింతము, మనము దేవుని వాక్యమును త్రోవకు వెలుగుగాను పాదములకు దీపముగాను చేసికొనుచు ఆయన వాక్యమందు స్థిరంగా నమ్మకముంచుదము.

మనము ఆశలు వదులుకొనకూడదు, కానీ ఆకాశమువైపు కన్నులెత్తి చూడవలెను; ఏలయనగా మన విమోచన సమయం సమీపించుచున్నది. "... మనము విశ్వాసులమైనప్పటికంటె ఇప్పుడు, రక్షణ మనకు మరి సమీపముగా ఉన్నది. రాత్రి చాల గడచి, పగలు సమీపముగా ఉన్నది. గనుక మనము అంధకార క్రియలను విసర్జించి, తేజస్సంబంధమైన యుద్ధోపకరణములు ధరించుకొందము" (రోమీయులకు 13:11, 12). యేసు నిన్న మరణించాడు, నేటి ఉదయం పునరుత్థానుడయ్యాడు, మరియు రేపు తిరిగి

రానైయున్నాడన్నట్లుగా మనము బ్రతుకుచుందము. మనము నిరుత్సాహపడకూడదు మరియు నిరాశపరలము కాకూడదు. కానీ దేవుని వాగ్దానములనెడు గొడుగు క్రింద జీవించుటకు మరింత దృఢనిశ్చయముగలవారమై యుండవలెను.

"భయపడకుము, పేరుపెట్టి నిన్ను పిలిచియున్నాను నీవు నా సొత్తు!" అనియు (యెషయా 43:1బి); "నీ దేవుడనగు యెహోవానైన నేను, 'భయపడకుము, నేను నీకు సహాయము చేసెదనని చెప్పుచు నీ కుడి చేతిని పట్టుకొనుచున్నాను' " అనియు (యెషయా 41:13); "భయపడకుము, నేను నీకు తోడైయున్నాను; నేను నీ దేవుడనైయున్నాను గనుక దిగులుపడకుము, నేను నిన్ను బలపరతును, నీకు సహాయము చేయువాడను అనియు (యెషయా 41:9, 10) ఆయనయందు నమ్మకముంచినవారితో మన దేవుడు సెలవిచ్చుచున్నాడు. ఆయన పరిశుద్ధ చిత్తము యొక్క వలయము లోపల, మనము అగ్ని గుండములో ఉన్నప్పటికిని, మనకు శాంతి మరియు సమాధానము లభిస్తాయి. మనము పరలోకమునకు వెళ్లవలెనని ప్రయత్నించుచున్న ఇహలోక పౌరులము కాదు, కానీ మనము ఇహలోకముగుండా పయనించుటకు ప్రయత్నించుచున్న పరలోక పౌరులమని మనము గుర్తుంచుకొనవలెను. మన జీవితం అంతమైనప్పుడు పరలోకమునకు వెళ్లవలెనని నిరీక్షించుచున్న వలస రాజ్యవాసులం కాదు; మనము మన నిజమైన పౌరస్థితి గల చోటికి వెళ్లవలసిన సమయం కొరకు వేచియున్న పరలోక రాజ్యవాసులమై యున్నాము.

---

సూచన

[1]అంత్య క్రియలకు సంబంధించిన ఈ సందేశము ఫిబ్రవరి మాసం 2005లో మరణించిన ఒక బంధువు, బాబ్ క్లోయెరె, గూర్చి ఉపన్యసింపబడినది. కుటుంబ సభ్యులు ప్రస్తావింపబడియున్నారు. ఈ సందేశమును మీ సందర్భమునకు సరిపడునట్లు సానుకూలంగా సద్వినియోగము చేసికొనవచ్చును.

---

## వాక్యభాగాన్ని వివరించుట

**నీల్ ప్రయర్**

---

### ❖❖❖ ఇశ్రాయేలు కొరకైన విమోచన క్రయధనము ❖❖❖
### (43 అధ్యాయము)

తన ప్రజలకు ఎటువంటి హాని కలుగకుండా దేవుడు వారిని తిరిగి వారి స్వస్థలమునకు తీసికొనివచ్చును. "యెహోవానగు నేను నీకు దేవుడను, ఇశ్రాయేలు పరిశుద్ధ దేవుడనైన నేనే, నిన్ను రక్షించువాడను; నీ ప్రాణ రక్షణ క్రయముగా ఐగుప్తును ఇచ్చియున్నాను, నీకు బదులుగా కూషును సెబాను ఇచ్చియున్నాను" అని దేవుడు సెలవిచ్చాడు (3 వచనం). దేవుడు ఇతర జనాంగములకంటే ఇశ్రాయేలును అత్యధికంగా ప్రేమించాడు. "నీవు నా దృష్టికి ప్రియుడవైనందున ఘనుడవైతివి మరియు నేను నిన్ను ప్రేమించుచున్నాను, గనుక నీకు ప్రతిగా మనుష్యులను అప్పగించుచున్నాను, నీ ప్రాణమునకు ప్రతిగా జనములను అప్పగించుచున్నాను" అని ఆయన సెలవిచ్చాడు (4 వచనం).

కూషు ఇతియోఫియాలో ఉండెను, అది నిజానికి సుదాన్ ప్రాంతమై యుండెను. సెబా

అనునది చిన్నది, పురాతనమైనదైన షేబ దేశమునకు మరొక నామమై యుండెనని చాలా మంది అనుకొంటారు. అరేబియా ద్వీపకల్పము యొక్క దక్షిణ దిగువ భాగములో షేబా దేశమైయుండిన ఒక చిన్న దేశమున్నది. ఈ నాడు ఆ దేశము యెమెన్ అని పిలువబడుచున్నది. 1 రాజులు 10వ అధ్యాయములో వ్రాయబడియున్నట్లు షేబా దేశపు రాణి సొలొమోనును సందర్శించినది.

ఈ అధ్యాయము "ఓదార్పు గ్రంథములో" భాగమై యున్నది. యెషయా ప్రవచనములలోని ఈ విభాగమందంతయును దేవుడు ప్రోత్సాహమును కలుగజేయు మాటలు సెలవిచ్చాడు. ఆయనే నిజమైన దేవుడని ఆయన ఉద్ఘాటించుచు చెప్పాడు (11–13 వచనాలు), మరియు తన ప్రజలను ఆయన విమోచించునని వాగ్దానమిచ్చాడు (14 వచనం). దేశబహిష్కరణ గతములోని భారమైయుండును. 22 నుండి 24 వచనములు సమాంతరత్వమైన ఒక చక్కని సమానార్థక ఉదాహరణమును ఉపయోగించుచున్నవి. ఇక్కడ, దేవుడు "భారమైయుండును" అని చెప్పినప్పుడు ఆయన భిన్నర్థాలు వచ్చేటట్లు మాటలాడుచున్నాడు.